# ముంచుకొస్తున్న నీటి ఎద్దడి!

- ఏడాది క్రితం కొట్టుకుపోయిన మూలకోన పైపులైన్లు
- నేటికీ మరమ్మతులు చేపట్టని అధికారులు
- తాగునీటికి ప్రజల అవస్థలు

**పుత్తూరు:** ఈ వేసవిలో ఎండల తీవ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అందుకు తగ్గట్టు మార్చి నెలలోనే ఎండలు మండుతున్నాయి. దీంతో చెరువులు, బావులు, బోర్లలో నీరు అడుగంటే క్రమం ప్రారంభమైంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో, పలు గ్రామాల్లో మంచినీటికి ప్రజల అవస్థలు అప్పుడే ప్రారంభమయ్యాయి. అయినా పుత్తూరు మున్సిపల్ అధికారుల్లో చలనం లేకపోవడం విచారకరం.

**కొట్టుకుపోయిన పైపులైన్లు**

దివంగత వైఎస్సార్ హయాంలో 2005లో మూలకోన నుంచి సమగ్ర గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని ప్రారంభించారు. రూ.3.2 కోట్లతో రెండు దశలుగా చేపట్టిన మూలకోన ప్రాజెక్టుతో పుత్తూరు పట్టణానికి తాగునీరు అందుతూ వచ్చింది. 2023 డిసెంబర్‌లో మిగ్‌జాం తుపాను కారణంగా మూలకోన నుంచి పుత్తూరు వరకు ఉన్న 7 కిలోమీటర్ల పైపులైన్లలో 2 కిలోమీటర్ల మేర కొట్టుకుపోయింది. అప్పటి నుంచి నేటి వరకు మూలకోన నుంచి నీటిసరఫరా ఆగిపోయింది. దీంతో లక్షల వ్యయంతో నిర్మించిన నాలుగు సంపులు సైతం నిరుపయోగంగా మారాయి. అప్పటి నుంచి పుత్తూరులో తాగునీటి సమస్య కొనసాగుతూనే ఉంది.



మూలకోన వద్ద మరమ్మత్తులకు నోచుకోని పైపులైను

పైడిపల్లెకు చెందిన ఓ రైతుకు చెందిన బోరును అద్దెకు తీసుకొని, నీటి సరఫరా చేస్తున్నారు. అయితే ఇది పూర్తిగా సరిపోవడం లేదు. రైతుకు నెలకు రూ.10 వేలు వంతున మున్సిపాలిటీ అద్దె చెల్లిస్తోంది. ఇలా ఏడాదిగా అద్దె చెల్లిస్తూ అరకొర నీటిని సరఫరా చేస్తున్నారే తప్పా పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం మూలకోన సమీప గ్రామాలైన పైడిపల్లి, హరిజనవాడ, నేసనూరు, తొరూరు గ్రామాలతో పాటు మూలకోన నీటిపైనే ఆధారపడ్డ పుత్తూరు పట్టణంలోని పలుప్రాంతాల ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. కొట్టుకుపోయిన పైపులైన్ల స్థానంలో మరమ్మతులు చేపట్టి మంచినీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**మరమ్మతుల అంచనా వ్యయం రూ.45 లక్షలు**

ఏడాది క్రితం కొట్టుకుపోయిన పైపులైన్ల మరమ్మతులకు తొలుత రూ.20 లక్షలు ఖర్చువుతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా కట్టారు. అయితే మారిన ధరల మేరకు ప్రస్తుతం రూ.45 లక్షలకు పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేస్తే ఖర్చులు తగ్గేవి. ఆలస్యం అయ్యేకొద్దీ ఖర్చు తడిసి మోపెడు అవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



నిరుపయోగంగా ఉన్న సంపలు



నిరుపయోగంగా ఉన్న మరో సంపు

**తాగునీటికి పక్క గ్రామాలకు వెళ్తునాం**



మూలకోన పైపులైన్ల ద్వారా మా గ్రామానికి, దళితవాడకు తాగునీరు అందేది. ఏడాది క్రితం పైపులైన్లు తుపాను దాటికి కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు వాటికి మరమ్మతులు చేపట్టలేదు. గ్రామ ప్రజలందరూ చుట్టు పక్కల గ్రామాల వద్దకు వెళ్లి నీటికోసం అవస్థలు పడుతున్నారు.అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించాలి.
–ఎస్.రాంబత్తయ్య, పైడిపల్లి దళితవాడ

**నీటి సమస్య మొదలు**



ఎంబీనగర్, గణపతినగర్‌లో 100 కుటుంబాలు నివశిస్తున్నాయి. వేసవి మొదలు కాకుండానే మాకు నీటి సమస్య మొదలైంది. తాగునీటి కోసం ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోంది. మూలకోన పైపులైన్ల మరమ్మతులు చేపడితే సరిపడా నీరందుతుంది. ఇప్పటికైనా అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టి గ్రామాలకు నీటి సమస్య లేకుండా పరిష్కరించాలి.
– ఊహ, ఎంబీ నగర్, పుత్తూరు

**రూ.10 లక్షలతో టెండర్లు పిలిచాం**



మూలకోన పైపులైన్ల మరమ్మతుల కోసం మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి రూ.10 లక్షలతో టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మరో రెండు వారాల్లో పనులు ప్రారంభమవుతాయి. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి సమస్య తలెత్తకుండా శ్రీరంగం చెరువు, షాపువీధి ఎక్స్‌టెన్షన్‌లో రెండు బోర్లువేశాం. నీరు సమృద్ధిగా వస్తోంది. తాగునీటికి ఎలాంటి సమస్య లేదు.
– ఎం.మంజునాథ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

## క్లుప్తంగా

### నర్సులు సేవామూర్తులు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పద్మావతమ్మ

**పుత్తూరు:** నర్సులు సేవామూర్తులని, వారి సేవలకు విలువ కట్టలేమని తిరుపతి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతమ్మ తెలిపారు. గురువారం స్థానిక కేకేసీ నర్సింగ్ కళాశాలలో ఫేర్‌వెల్ ఫంక్షన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించగలిగే వారే ఈ వృత్తిలో రాణించగలరన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వై.వరలక్ష్మి, కళాశాల చైర్మన్ కుప్పయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

### రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**వెదురుకుప్పం:** మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అమర్‌నాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే థామస్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

### దుస్థితిలో చెంచుగుడి రోడ్డు



అధ్వానంగా ఉన్న రోడ్డు

**వెదురుకుప్పం:** మండలంలోని చెంచుగుడి రోడ్డు దుస్థితికి చేరింది. గతంలో చిత్తూరు–తిరుపతి ప్రధాన రహదారి నుంచి చెంచుగుడి, రెంటాల చేను, చింతలగుంట మీదుగా నల్ల వెంగనపల్లె వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే అది ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. రోడ్డు ఎక్కడ పడితే అక్కడ గోతులమయమైంది. కంకర తేలి రూపురేఖలు కోల్పోవడంతో పాదచారులు. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పాటి వర్షానికే రోడ్డుపై నీళ్లు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోడ్డు మరమ్మతులకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### బెండ సాగు లాభదాయకం



విజయపురం : బెండసాగు

**విజయపురం:** మండలంలో బెండ సాగుపై రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. సాంప్రదాయ పంటలకు గిట్టుబాటు లేకపోవడంతో రైతులు కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. ఇప్పటికే విజయపురం, మహారాజపురం, సూరికాపురం, పన్నూరు, గంగమాంబపురం తదితర గ్రామాల్లో రైతులు కూరగాయల సాగు చేసి ఉన్నారు. తక్కువ ఖర్చు ఎక్కువ ఆదాయం వస్తుండడంతోనే కూరగాయలు సాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

### అందరికీ పని కల్పించాలి

**విజయపురం:** జాబ్‌కార్డు కలిగి ఉన్న వారందకీ 100 రోజులు పని కల్పించాలని బుధవారం ఏపీఓ బబిత ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలో జాతీయ ఉపాధి హామీ పనులు వేగం పెంచాలని, అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం వెయ్యి మంది పని చేస్తున్నారని, ఆ సంఖ్యను రెండు వేలకు పెంచాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 30లోపు ప్రతి కుటుంబం 100 రోజులు పని పూర్తి చేసుకోవాలన్నారు.

### ఉపాధ్యాయులకు ప్రశంసలు



అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

**నగరి:** మండలంలోని కావేటిపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షిక తనిఖీ నిర్వహించిన ఎంఈఓ శ్రీదేవి ఉపాధ్యాయులను ప్రశంసించారు. గురువారం ప్యానల్ సిబ్బంది, సీఆర్పీలతోపాటు పాఠశాలలో ప్రార్థనా సమయం నుంచి సాయంత్రం వరకు జరిగే ప్రతి అంశాన్ని తనిఖీ చేశారు. తరగతి గది నిర్వహణ, మధ్యాహ్న భోజనం పరిశీలన, 1 నుంచి 5వ తరగతులకు క్యాలెండర్ అమలు, 3, 4, 5 తరగతుల కనీస అభ్యసన సామర్థ్యాలైన టీక్యూఆర్‌ఎల్‌ను పరిశీలించారు. బేస్‌లైన్, మిడ్‌లైన్ పరీక్షా ఫలితాలను పరిశీలించి ప్రగతి కనిపించడంతో ఉపాధ్యాయులు దుర్గ, హేమావతిని అభినందించారు. వెనుకబడిన ముగ్గురు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

## ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం పెంపు



మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి

**గంగాధరనెల్లూరు:** ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్ల నిర్మాణం కోసం రూ.50 వేల నుండి లక్ష వరకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందజేస్తుందని ప్రచారం చేపట్టాలని ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గంగాధరనెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈలు క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రణాళికబద్ధంగా ఇళ్ల నిర్మాణాల పురోగతికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆడిటింగ్



ఆడిట్ సమావేశంలో మాట్లాడుతున్న తిరుకుమారన్

**నగరి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అకడమిక్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ నిర్వహించారు. పీవీకేఎన్ కళాశాలకు చెందిన డాక్టర్ తిరుకుమారన్, ఎస్‌పీఎస్ కళాశాలకు చెందిన డాక్టర్ మల్లికా భ్రమరాంబ ఆడిట్‌లో భాగంగా రికార్డులు తనిఖీ చేశారు. ఆడిట్ సమావేశంలో రికార్డులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపల్ ఎం.భాస్కర్ రాజు, ఐక్యూకో–ఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

**గంగాధరనెల్లూరు:** బాలల, మహిళ సంరక్షణా చట్టాలపై అవగాహన అవసరమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికాన సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.భారతి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వేపంజేరి గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దశావతార పుష్కరిణి ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జడ్జి భారతి మాట్లాడుతూ బాలికలు, మహిళల సంరక్షణకు సచివాలయ పరిధిలోని మహిళా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి సుబ్రమణ్యం, లీగల్ ఆఫీసర్ ఎంఎస్ వెంకటేష్, తహశీల్దార్ చంద్రశేఖర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ శివశంకర్, సీడీపీఓ వినుత శ్రీ, షణ్ముగం, మురళి, వేపంజేరి పంచాయతీ ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి భావన, వీఆర్‌ఓ శివాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## హోలీ పండుగకు జాగ్రత్తలు పాటించాలి

**కార్వేటినగరం:** హోలీ పండుగను మండలంలోని ప్రజలు ఆనందంగా భద్రత పాటిస్తూ చేసుకోవాలని కార్వేటినగరం ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. రంగుల పండుగ సందర్భంగా గాండ్ల మెట్ట కూడలి, కార్వేటి నగరం పట్టణంలో 15 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. హోలీ పండుగను సంస్కృతిని కాపాడే విధంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని కోరారు. ఎవరైనా బలవంతంగా రంగులు చల్లడం, అసభ్యంగా ప్రవర్తించడం, మహిళలను అసహజంగా వేధిస్తే తక్షణమే 112 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

## మత్తులో యువత



కేజే పురంలో గంజాయికి ఉపయోగించిన వాటర్ బాటిల్

**పాలసముద్రం:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో మద్యం, నాటుసారా ఏరులై పారుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా బెల్టు షాపుల్లో మద్యం లభిస్తోంది. పాలసముద్రం, ఆముదాల, నరసింహపురం, శ్రీబొమ్మరాజుపురంలలో ఆరు బెల్ట్ షాపులు ఉన్నాయి. బాటిల్‌పై రూ.40 నుంచి రూ.60 వరకు అధికంగా విక్రయిస్తున్నారు. స్థానికులు ఎక్సైజ్ శాఖ వారికి ఫిర్యాదు చేస్తున్నారు. అయితే ఎక్సైజ్ శాఖ వారే బెల్టు దుకాణాల వారికి ఫలానా వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు చెప్పేస్తున్నారు. నరసింహపురం, కన్నికాపురం, అలిమేలుమంగాపురంలో నాటుసారా తయారీ ముమ్మరంగా సాగుతోంది. కన్నికాపురంలో సాయంత్రమైతే సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. యువకులు గంజాయికి ఎక్కువ మంది బానిసలై పోతున్నారు. క్రిష్ణజమ్మపురంలో గంజాయి విక్రయాలు ఎక్కువగా సాగుతున్నాయి.

## యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోండి

**విజయపురం:** వ్యవసాయ సబ్సిడీ యంత్ర పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రజినికుమారి బుధవారం తెలిపారు. ఆర్‌ఎస్‌కే కేంద్రంలో దరఖాస్తు చేసుకోవలన్నారు. స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పనిముట్లు, రోటావేటర్లు, పవర్‌వీడర్లు తదితర వ్యవసాయ పనిముట్లు 50 శాతం సబ్సిడీ ద్వారా రైతులు అందిస్తామన్నారు.

## వినియోగదారులను కష్ట పెట్టొద్దు



ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్న వినియోగదారులు

**నగరి:** గ్యాస్ పంపిణీలో వినియోగదారులకు ఎలాంటి కష్టాలు ఉండకూడదని వినియోగదారుల సంఘం కార్యదర్శి జ్యోతినాయుడు అన్నారు. గురువారం నగరి పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లిన ఆయన నిర్వాహకులతో వినియోగదారుల సమస్యలపై చర్చించారు. బుక్ చేసిన వారికి ఇళ్ల వద్దకే సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. ఒక స్టాక్ పాయింట్ వద్ద సిలిండర్లు ఉంచి అక్కడికే వినియోగదారులను రమ్మని సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లకు బ్యాంకు ఖాతాల్లో కొందరికి నగదు పడడం లేదన్నారు. దీనిపై ఏజెన్సీ నిర్వాహకులు సమాధానమిస్తూ వెంకటరమణ హెచ్‌పీ గ్యాస్ గ్రామీణ విట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా నగరి, నగరి రూరల్, విజయపురం, నింద్ర, పిచ్చాటూరు కలిపి 15,261 సిలిండర్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. అందులో 9,613 మంది అర్హుల జాబితాలో ఉన్నారని తెలిపారు. ఇందులో 8,510 మందికి సబ్సిడీ జమ అయిందన్నారు. మిగిలిన 1103 మంది ఏజెన్సీలో ఎంట్రీ చేసుకోలేదని వారికి కూడా జమ అవుతుందన్నారు.

## విశిష్ట సంఖ్య నమోదు చేసుకోండి



శ్రీహరిపురంలో విశిష్ట సంఖ్యపై ర్యాలీ

**విజయపురం:** రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని జిల్లా శాస్త్రవేత్త సంధ్యరాణి తెలిపారు. శ్రీహరిపురంలో బుధవారం విశిష్ట సంఖ్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో 5 వేల మంది రైతులు ఉన్నారని తెలిపారు. వారిలో ఇప్పటివరకు 3053 మంది రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకొన్నారని, మరో 2వేల మంది త్వరగా చేయించుకోవాలని సూచించారు. ఏఓ రజినికుమారి పాల్గొన్నారు.

## మార్మోగిన శివనామస్మరణ





స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, భక్తులకు అన్నదానం

**శ్రీరంగరాజపురం:** పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలో వెలసిన శ్రీఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో శివనామస్మరణతో మార్మోగింది. పల్లెరుకోనలో వెలసిన శ్రీఆత్మలింగేశ్వర స్వామివారికి ఉభయదారులుగా రామిరెడ్డి వనజ దంపతులు ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి సందర్భంగా తెల్లవారు జామున అభిషేకం, మధ్యాహ్నం ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి పాశుపత సహిత ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. దర్శనం కోసం ఆలయ సభ్యులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ధర్మకర్త మోహన్‌నాయడు, సర్పంచ్ హరితకుప్పయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో బహుమతి ప్రదానం

**వెదురుకుప్పం:** మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్‌లో గురువారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు చేపట్టారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్లు ప్రధానోపాధ్యాయులు సిద్ధయ్య తెలిపారు. చివరిగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చైర్మన్ చెంగల్రాయులు, వైస్ చైర్మన్ రామక్క, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు భరోసా



జయశీలన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



అగ్ని ప్రమాద బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

**నగరి:** అయినవాళ్లను పోగొట్టుకున్న కుటుంబాలకు తానున్నానంటూ మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. గురువారం మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడకు వెళ్లిన ఆమె ఇటీవల మృతి చెందిన వైఎస్‌ఆర్ సీపీ నేత జయశీలన్ కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్‌ఆర్ సీపీ నేత అమాన్‌భాయ్ కుమార్తెను పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలిని ఓదార్చారు. అనంతరం ఇటీవల మాతృవియోగానికి లోనైన వైఎస్‌ఆర్ సీపీ నేత సలీంను, అయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్‌ఆర్ సీపీ మున్సిపల్ కన్వీనర్ రమేష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బీడీ భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు మోహన్‌రాజ్, ఇంద్రయ్య, మురగయ్య, యాకోబు, వెంకటేశ్, హమీద్, నాయకులు బీఆర్వీ అయ్యప్పన్, యువరాజ్, కన్నాయిరం, ఆనంద్‌కుమార్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడి వదిలెయ్.. శ్రద్ధ పెట్టు

ఏడాది శ్రమ.. ఫలితానికి పరీక్షలే ప్రామాణికం. విద్యార్థి జీవితానికి పదో తరగతి కీలక మలుపు. ఉన్నత విద్యకు ఆ తర్వాత బంగారు భవిష్యత్తుకు పదే పునాది. ఇది దృఢంగా ఉండాలంటే పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి. అందుకే పరీక్షలు సమీపించే కొద్దీ.. విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. పరీక్షలంటే కొందరు విద్యార్థులకు భయం.. ఆందోళన చెందుతుంటారు. విద్యార్థులు అధిక శాతం సమయం చదవడం, పౌష్టికాహారం తీసుకోకపోవడం, నిద్రపోకుండా చదవడంతో మానసిక ఒత్తిడికి గురువుతుంటారు. పరీక్షలంటే సాధారణమని, ప్రణాళికాబద్ధంగా చదువుకుంటూ మెళకువలు పాటించగలిగితే ఇవేవి కష్టం కాదంటున్నారు ఉపాధ్యాయులు. విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపుతున్నారు. –నగరి

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటుగా 53 ఉన్నత పాఠశాలల్లో చదివే 3239 మంది విద్యార్థులు ఈ ఏడాది పది పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా 21 పరీక్షాకేంద్రాలు సిద్ధం చేశారు. నగరి మండలంలో 6 కేంద్రాలు, పుత్తూరు మండలంలో 10, విజయపురం మండంలో 2, వడమాలపేట మండలంలో 2, నింద్ర మండలంలో చొప్పున పరీక్షా కేంద్రాలు సిద్ధమయ్యాయి. ఈ నెల 17వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

**ఒత్తిడిని అధిగమించాలి..**

ఏడాది పాటు చదివిన విద్యార్థులు చివరి మూడు గంటలు జరిగే పరీక్షల్లో తమ ప్రతిభ చూపాలి. రాసిన పరీక్షల్లో వచ్చిన మార్కులు ఆధారంగానే తదుపరి చదువులు ఆధారపడి ఉంటాయి. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు విపరీతమైన ఒత్తిడికి గురవుతారు. బాగా చదివి ఉన్నత ర్యాంకులు సాధించాలని కొందరు, ఎలాగైనా పాస్ కావాలని వెనుకబడిన విద్యార్థులు.. మంచి మార్కులు వస్తే నచ్చిన కాలేజీల్లో చేరవచ్చని మరికొందరు తపన పడుతూ, పోటీపడుతూ ఆరోగ్యంపై శ్రద్ధ వీడి రాత్రి పగలు చదువుపై దృష్టి సారిస్తారు. ఆరోగ్యాన్ని విస్మరించి ఒత్తిడితో చదువుతుంటారు. ఆందోళన చెందక ఒత్తిడిని అధిగమించాలని నిపుణులు చెబుతున్నారు.



10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ బోధనలు

**ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు..**

పదో తరగతి పరీక్షలకు ఇప్పటికే హాల్ టిక్కెట్లు జారీ అయ్యాయి. ప్రతి రోజు సబ్జెక్టులపై గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రీ పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యాయి. పరీక్షల సమయంలో విద్యార్థుల చదువుతో పాటు యోగా చేయాలని, ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులు ముందుకు సాగితే ఆనందంగా పరీక్ష రాయవచ్చు.